

## ప్రతి ఇంటా భోగ భాగ్యాలు కలగాలి : డిప్యూటీ సిఎం

**ప్రజాశక్తి-పార్వతీపురం**

జిల్లా ప్రజలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రతి ఇంట భోగభాగ్యాలు కల్పించాలని ఉప ముఖ్యమంత్రి ఆకాక్షించారు. పంటలు ఇంటికి వచ్చే వేళ ప్రతి ఒక్కరూ ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థిక అభ్యున్నతికి అడుగులు వేయాలని ఆయన ఆకాంక్షించారు. సంక్రాంతి ప్రతి ఇంటా కాంతులు నింపాలని, భోగభాగ్యాలు చేకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఇంటిల్లపాదీ ఆనందంగా, సంతోషంగా పండగ జరుపుకోవాలని కోరారు. కుటుంబం యావన్మంది కలుసుకునే ఒక గొప్ప పర్వ దినమని, అదేవిధంగా అన్ని బంధాలు ధడంగా కొనసాగి ప్రతి కుటుంబం అభ్యున్నతి సాధించాలని ఆయన ఆకాక్షించారు.

# ఏవీ నాటి సంక్రాంతి సందళ్లు ?



- మారుతున్న గ్రామీణ ముఖచిత్రం
- పచ్చదనం కోల్పోతున్న పల్లెలు
- కనుమరుగవుతున్న వృత్తులు
- సంక్రాంతి వేళ వింతలా చూడాల్సిన పరిస్థితి

**ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి**

**ఓవైపు ఆధునిక పరిజ్ఞానం... మరోవైపు సంస్కృతి, సంప్రదాయాలను దెబ్బతీసే విధానాలు వెరసి గ్రామీణ ముఖచిత్రాలు మారుతున్నాయి. ఇందులో అభివృద్ధికి దోహదపడే అంశాలను కాస్త పక్కనబెడితే... వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధానాలు గ్రామీణ శోభను దెబ్బతీశాయి. సంక్రాంతి వేళ పుట్టిపెరిగిన ఊళ్లలో చిన్ననాటి జ్ఞాపకాలు, తీపిగుర్తులు నెమరువేసుకుని హాయిగా గడపాలని వచ్చేవారికి ఒకింత నిరాశ ఎదురౌతోంది. ప్రభుత్వ విధానాలు అందులో ప్రాధాన్యతలే ఇందుకు మూలం.**

సంక్రాంతి అంటేనే గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే పాడిపశువులు, పంటలు, గొబ్బెమ్మలు, నాటు బండ్లు, హరివిల్లులను తలపించే ముగ్గుల పోటీలు గుర్తుకు వస్తాయి. వాటన్నింటినీ తమ సొంత ఊళ్లలో తనివితీరా చూడాలనే ఆశతో ఎంతో దూరంలో వున్నవారు సైతంసొంత గ్రామాలకు ఇంటిల్లా పాది తరలివస్తుంటారు. మారిన విధానాలతో ప్రస్తుతం గ్రామీణ ముఖచిత్రాలు మారి పోయాయి. మన జిల్లా భౌగోళికంగా రాష్ట్రంలో అన్నింటికన్నా చిన్నది. జిల్లాల పునర్విభజన వల్ల విజయనగరం చాలా జిల్లాలతో పోలిస్తే పెద్దది. పార్వతీపురం మన్యం జిల్లా దాదాపు రాష్ట్రంలో చిన్నది. అయినా వనరులకు కొదవలేదు. విశాలమైన ఏజెన్సీ ప్రాంతం జిల్లాకు మణిహారంలా ఉంటుంది. ఈ రెండు జిల్లా పరిస్థితులు ఒక్కసారి అవగతం చేసుకుంటే...సారవంతమైన భూములు ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలు సాగు చేసేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. సాగునీటి వనరులు పెద్దగా లేకపోయినప్పటికీ ఎన్నో నదులు, జీవగెడ్డలు ఉండడం వల్ల వాటిలో నీటిని ఒడిసిపట్టి వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు వంటి వ్యవసాయ పంటలు సాగుచేసే పరిస్థితి ఈ జిల్లాల ప్రత్యేకం.

ఇతర జిల్లాలతో పోల్చుకుంటే మన జిల్లాలో భూ కమతాలు చాలా చిన్నవిగా వుండడం, ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ అందుకునేందుకు ఆర్థికంగా రైతులకు వెసులుబాటు లేకపోవడం వంటి కారణాల వల్ల ఐదారేళ్ల క్రితం వరకు నాగలితోనే దుక్కులు పట్టేవారు. ఇంకొంచెం ముందుకు వెళ్తే... కుటుంబానికో నాటుబండి ఉండేది. వాటిని తయారు చేసే వడ్రంగి నిత్యం పనిలో బిజీగా ఉండేవాడు. మరెక్కడా లేనంతగా జనుము సాగు ఉండడంతో వాటిని చెరువుల్లో ఊరబెట్టడం, వారం పది రోజుల తరువాత నారతీసి విక్రయించుకునేవారు. ఆ కర్ర (కటికర్ర)లు వంటచెరకుగా ఉపయోగ పడేవి. ఇక వరి ప్రతి ఇంటా పండేది. సంక్రాంతికి కొద్దిరోజుల ముందు పసువులతో మట్టించడం, లేదా రోలర్లు (పెద్దపెద్ద రాళ్లు)తో వరి నూర్పులు చేసేవారు. ఆ క్రమంలో రైతులు పడ్డ శారీరక కష్టాన్ని మర్చిపోయి పని సునాయాశంగా నడిచేందుకు జానపదాలతో కల్లాలన్నీ వీణుల విందుగా మారేవి. ఇప్పట్లో కల్లాలంటే పశువులు, కోళ్ల పెంపకంతోపాటు నాగళ్లు, నాటుబండ్లు, వడ్లరాసులు, ధాన్యపుగాదులు కనిపించేవి. ఇలా రైతులు, ఇతర వృత్తిదారులు, సరుకులమ్మే షావుకారుల దుకాణాల్లో శ్రమ జీవన సౌందర్యం సంక్రాంతి సమయాల్లో ఉట్టుపడేది. ఉద్యోగం, వ్యాపారం రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి పండక్కి వచ్చేవారంతా ఇక్కడి యాసభాషల్లో కలగలిసి ఎంచక్కా పల్లె వాతావరణాన్ని ఎంజాయ్ చేసేవారు. మరోవైపు నదీ పరివాహక గ్రామాల్లో ఇసుక తెన్నులపై సంక్రాంతి మరుచటి రోజు కనుమ సందర్భంగా యువత సందడిగా గడిపేవారు. కానీ నేడు ఇసుక తవ్వకాల వల్ల ఎక్కడా ఇసుక తెన్నులు కానరావడం లేదు. పైగా నదులన్నీ వాటి స్వరూపాలు మారిపోయి గోతులుగా దర్శనమిస్తున్నారు. ఫలితంగా నేడు గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే వాతావరణం కనుమరుగవుతోంది.



విజయనగరం ఉమ్మడి జిల్లాలో సాగుభూమి తగ్గిపోయింది. వాస్తవానికి మన జిల్లా భౌగోలిక విస్తీర్ణం 16, 34,750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 9,25,387.5 ఎకరాల్లో వివిధ వ్యవసాయ, వాణిజ్య పంటలు సాగయ్యేవి. కానీ సాగుభూమి ఏటా తగ్గిపోతోంది. ప్రస్తుత ఖరీఫ్‌సీజన్‌లో కేవలం 3,41,130 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. వ్యవసాయ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 80శాతం జనాభా ఆధారపడి జీవిస్తోంది. కానీ, అపారమైన సాగునీటి వనరులు ఉన్నా వాటిని వినియోగంలోకి తేవడంలో పాలకులు విఫలమయ్యారు. సాగునీటి వసతి కల్పించక పోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించక పోవడం, ప్రభుత్వం బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణావల్ల సాగు భూమి తగ్గుతోంది. ఈ ప్రభావం రైతులతో పాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. మత్స్యకారులు, వడ్రంగి, చేనేత వంటి వృత్తుల నుంచి నేటి తరం దూరమౌతోంది. సుమారు 30ఏళ్లలో వచ్చిన మార్పులే ఇందుకు నిదర్శనం. ఇలా గ్రామీణ ముఖచిత్రాలే మారి పోతుండడంతో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, నాటు బండ్లను చివరకు రైతులు ధరించే సంప్రదాయ దుస్తులను కూడా నేటి జనం వింతగా చూడాల్సిన దుస్థితి దాపురిస్తోంది.



ఆర్‌బికె వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

## ధాన్యాన్ని తక్షణమే తరలించాలి

### సిపిఎం ఆధ్వర్యాన ఆర్‌బికె వద్ద రైతులు ఆందోళన

**ప్రజాశక్తి - సీతానగరం**

ధాన్యాన్ని తక్షణమే తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని అంటిపేట రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న ప్రతిగింజ కొంటామని చెప్పినప్పటికీ కొనడంలేదన్నరు. అంటిపేట, ఆర్.వెంకంపేట, బగ్గందొరవలస, పైడమ్మకాలనీ ఆర్‌బికెల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి. ఈ మేరకు బుధవారం ఆందోళన చేసిన సందర్భంగా పదివేల బస్తాలు తరలిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, అయితే నాలుగు లారీలకు ట్రక్ సీట్లు తీయలేదని నెపంతో లోడు చేసిన లారీలు కేంద్రాల వద్ద ఉంచడం సరికాదని అన్నారు. అధికారులు హామీలు గాలికి వదిలేస్తున్నారన్నారు. బల్లకృష్ణాపురానికి చెందిన బల్ల నారాయణస్వామి అనే రైతు 200బస్తాలు నూర్పులు చేసి కల్లంలో ఉన్నప్పటికీ గత 20రోజులుగా పంపించకపోవడం అధికారుల నిర్లక్ష్యమన్నారు. తక్షణమే కలుగు చేసుకొని ధాన్యాన్ని పంపించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బి.అప్పారావు, బి.నారాయణ స్వామి, రెడ్డి రమణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అర్.ఈశ్వరరావు, రైతులు ఈ.శ్రీనివాసరావు, పీల విశ్వనాథం, పైల సూర్యనారాయణ, ఎం.బలరాం, బి.నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ధాన్యపు గింజను కొనాలి**

**కలెక్టరేట్ :** జిల్లాలో పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనాలని కలెక్టర్ ఆఫీసు ఎఒకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు వినతిని అందజేశారు. ఆన్లైన్ జంబ్లింగ్ పేరుతో మిల్లర్ల దోపిడీ, అక్రమాలు అరికట్టాలని, రైతులు వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని ధాన్యం సేకరణ పూర్తయిందని లాగిన్లు నిలుపుదల చేయరాదని కోరారు. వినతిని అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు బంటు దాసు ఉన్నారు.

## సిఎఫ్‌ఎంఎస్ - ఇకెవైసి అనుసంధానం

**పార్వతీపురంటౌన్ :** జిల్లాలో అన్ని కార్యాలయాల అధికారులు, సిబ్బంది సిఎఫ్‌ఎంఎస్ ఐడితో ఇకెవైసి అనుసంధానం చేయాలని జిల్లా ఖజానా అధికారి ఎ.మన్మథరావు తెలిపారు. డిడిఒలకు సిఎఫ్‌ఎంఎస్ ఐడితో ఇకెవైసి అనుసంధానంపై శుక్రవారం జిల్లా ఖజానా అధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా ఖజానా అధికారి మన్మధరావు, సహాయ ఖజానా అధికారి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈనెల 20లోగా ఇకెవైసి అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు ప్రదానం

**ప్రజాశక్తి - సీతానగరం**

సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని మండల కేంద్రమైన సీతానగరంలో ఎల్‌విఆర్ సేవా సంస్థ వ్యవస్థాపకులు కె.అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లుకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే జోగారావు బహుమతి అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి వాలీబాల్ కిట్లు బహుమతులను ప్రధానం చేశారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి అనేక అభివృద్ధి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యవస్థాపకులు మెచ్చుకుంటూ భవిష్యత్తులో ఇంకెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

## పాత పద్ధతిలోనే ఉద్యోగోన్నతులు కల్పించాలి : ఫ్యాప్టో

**ప్రజాశక్తి - కలెక్టరేట్**

బదిలీల ప్రమోషన్ ప్రక్రియ కోర్టులో ఉందన్న నేపంతో ఎటువంటి సర్వీసు నిబంధన లేకుండా గతంలో ఇచ్చిన ఉద్యోగోన్నతులు చేపట్టకుండా అక్టోబర్ 2022లో ఉద్యోగోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన వారికి ఉత్తర్వులు ఇవ్వకుండా ప్రభుత్వం చేపట్టిన తాత్కాలిక పని సర్దుబాటు ప్రక్రియను, అసంబద్ధమైన విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ వి.ధనుంజయ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులపై కొత్తరకం ఇబ్బందులు సృష్టించకుండా పాత విధానంతోనే పదోన్నతులు జరపాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎస్.మురళీమోహన్‌రావు, కార్యదర్శి నరసింహరావు, కోశాధికారి పి.శ్రీనివాసరావు, నాయకులు గోవిందరావు, శ్రీనివాసపట్నాయక్, బాలకృష్ణారావు, వివిధ సంఘాల ఫ్యాప్టో రాష్ట్ర జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.






పార్వతీపురం, బలిజిపేటలో నిరసన తెలుపుతున్న ఆటో, మోటారు కార్మికులు, సిఐటియు నాయకులు

## రోడ్డు టాక్స్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

**ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్**

రోడ్డు టాక్స్ పేరుతో 30శాతం పైగా భారాలు పెరిగే జీవోను వెనక్కి తీసుకోవాలని సిఐటియు నాయకులు అన్నారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాహన యజమానులపై భారం మోపుతూ చేసిన త్రైమాసిక రోడ్ టాక్స్ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఆటో, మోటారు వర్కర్స్ యూనియన్, సిఐటియు పట్టణ కమిటీ పాత బస్టాండ్ ఆటో, వాహనాల స్టాండ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగి ఆటో కార్మికుల అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రయాణికులపై ఇది అదనపు భారమని అన్నారు. 30శాతం టోల్ టాక్స్‌ను పెంచితే వాహన యజమానులపై అదనపు భారం వేసిందన్నారు. కరోనాతో కుదేలైన రవాణా రంగం ఎప్పటికీ కోలుకోలేదని, పైగా టోల్ టాక్స్ వాహన యజమానులపై అదనపు భారం పడుతుందని అన్నారు. ప్రతి ఏటా టోల్ గేట్లు రేట్లు 15శాతం పెంచుతున్నారని, కిస్తీలు కట్టలేక కిరాయిలు రాక ఉన్న వాహన యజమానులపై మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఉందన్నారు. దీనివల్ల ప్రజలపై పరోక్షంగా భారం పడుతుందన్నారు. జిఒ 1 తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల గొంతు నొక్కేలా ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగభూషణ, సింహాచలం, భాస్కరరావు, మణిభూషణ, కృష్ణ, వినోద్, సన్యాసినాయుడు, సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

**సాలూరు:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రోడ్ ట్యాక్స్ పెంపు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ స్థానిక మోటార్ కార్మికుల సంఘం ఆధ్వర్యాన ఆటోడ్రైవర్ లు నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన పట్టణంలోని ఆటోకార్మికులు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30శాతం రోడ్ ట్యాక్స్ పెంపు వల్ల వాహన యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే ప్రమాదం ఉందని చెప్పారు. పట్టణంలో లారీ యజమానులు ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని చెప్పారు. ప్రతి మూడు నెలలకు రోడ్ ట్యాక్స్ చెల్లింపు వాహన యజమానులకు పెనుభారంగా మారుతుందని చెప్పారు. వెంటనే పెంపు ఉత్తర్వులను రద్దు చేయాలని ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోటారు కార్మికుల సంఘం నాయకులు శంకరరావు, ఇతరులు పాల్గొన్నారు.

**బలిజిపేట :** 30 శాతం పెంచిన రోడ్డు టాక్స్ ఉత్తర్వులను వెంటనే ప్రభుత్వం ఉపసహరించుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల కేంద్రంలో మోటారు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రోడ్డు టాక్స్ ఉత్తర్వులను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ రోడ్ టాక్స్ పెంచడం వల్ల కిరాయిలు లేక కిస్తీలు కట్టలేక వాహనాల నిర్వహణా ఛార్జీలు పెరిగి రవాణా రంగం దివాలా తీస్తుందన్నారు. జీవో 21 వల్ల రాష్ట్రంలో చలానాలు, జరిమానులు మూడు రెట్లు పెరిగాయన్నారు. ప్రస్తుతం ప్రజలపై పరోక్షంగా వేల కోట్ల రూపంలో పన్నులు నిరంతరం వసూలు చేస్తున్న ప్రభుత్వం మోటర్ రంగంపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మహేష్, శ్రీను, సింహాచలం, శంకర్రావు, మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




సాలూరులో నిరసన తెలుపుతున్నమోటారు కార్మికులు

## వరిపంటకు నిప్పు

- కాయ కష్టం బుగ్గిపాలు
- రూ1.50లక్షలు నష్టం

**ప్రజాశక్తి వీరఘట్టం**

వేలాది రూపాయలు పెట్టుబడితో పాటు ఆరు గాలం ఎంతో శ్రమించి పండించిన పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆ కుటుంబంలో పండగపూట రోదన మిగిలింది. మండల కేంద్రంలోని కర్రల మిల్లు సమీపాన వీరఘట్టంకు చెందిన ఆలుబిల్లి మజ్జిశ్వరరావు రెండున్నర ఎకరాల్లో సాగుచేసి వరిపంటను కోసి కుప్పలుగా ఏర్పాటు చేసుకున్నాడు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి 10గంట వరకు కాపాలా ఉండి అనంతరం ఇంటికి వెళ్లిపోవడం ఆనవాయితిగా వస్తుంది. చేనును నాశనం చేయకుండా ఉండేందుకు చుట్టూ చీరలను కంచేగా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు వరికుప్పలకు నిప్పంటించడంతో శుక్రవారం వేకువ జామున మజ్జిశ్వరరావు వచ్చేసరికి పంట మొత్తం కాలి బూడిదైపోయింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై రోధించారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి, ఎంతో కష్టపడి పండించిన పంట చేతికి అందకుండా ఇలా బుగ్గిపాలవ్వడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మదుపుల కోసం తెచ్చిన అప్పులు తీరిపోగా మిగిలిన దానితో పండగ జరుపుకుందామ్న అతని ఆశ హావిరైపోయింది. స్థానిక ఎస్సై ఎం హరికృష్ణ కి సమాచారం తోపాటు పాలకొండ అగ్నిమాప చకటానికి సమాచారం అందజేశారు. సుమారు 20 కిలోమీటర్ల దూరం ఉన్న అగ్నిమాపక సకటం వచ్చేసరికి జరగాల్సిన ఆస్తి నష్టం పూర్తిగా జరిగిపోయింది. సుమారు రూ.లక్షా50వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్గిమాపక సిబ్బంది తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

### 16న స్పందన రద్దు

**ప్రజాశక్తి-పార్వతీపురం**


ఈనెల 16న జరగాల్సిన స్పందన వినతుల కార్యక్రమాన్ని కనుమ సందర్భంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదుదారులు గమనించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
- ఐదు గంట పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

**ప్రజాశక్తి - కురుపాం**

కురుపాం శివారులో గల మంతిన చెరువు గట్టుపై బిటి రహదారికి ఎడమ వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. దీంతో స్తంభం పూర్తిగా వంగి పోయింది. ఈ సమయంలో విద్యుత్ తీగెలు తెగక పోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానిక సబ్ స్టేషన్ నుంచి గ్రామంలోకి విద్యుత్ సరఫరా వచ్చే 33కెవి లైన్ కావడంతో సుమారు ఐదు గంటల పాటు సరఫరా నిలిపివేశారు. విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన స్థంభం మార్పు కోసం ఏర్పాటు చేశారు. కారు యజమాని స్థానిక ప్రైవేటు ఒకేషనల్ కళాశాల యాజమాన్యం వ్యక్తి గా తెలిసింది.



కారు ఢీకొనడంతో వంగిపోయిన విద్యుత్ స్తంభం

## రైతుల కష్టం దళారుల పాలు

**ప్రజాశక్తి - కురుపాం**

పగలనక, రాత్రనక.. ఎండనక, వాననక.. కుటుంబమంతా శ్రమను ధారపోసి పండించిన వరి పంటను అమ్ముకునే దశలో దళారుల బారిన పడి రైతులు మోసపోతున్నారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయక, గిట్టుబాటు ధరకు అమ్ముకోలేక, దళారీల బారినపడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడికి అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులను వడ్డీతో సహా తీర్చేందుకు పండించిన పంటను వెంటనే అమ్ముకునేందుకు రైతులు చూస్తున్నారు. పంటను దాచుకోలేక ప్రభుత్వాలు కొనడానికి ముందుకు రాకపోవడంతో ఎంతో కొంతకు దళారీలు విక్రయించేస్తున్నారు. దళారులు రూ.900 నుంచి రూ.1000కి మించి ఇవ్వడంలేదు. గ్రామాల్లో దళారీ వ్యవస్థ ద్వారా రోజుకు కొన్ని వందల టన్నులు విక్రయాలు జరుగుతుంటే రైతు భరోసా కేంద్రాల ద్వారా కనీసం కూడా కొనుగోలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు పండించిన పంటను చివరి గింజ వరకు కొంటామని ప్రభుత్వాలు ప్రగల్భాలు పలకడం తప్ప ఆచరణలో కానరావడంలేదు. దేశానికి వెన్నెముక రైతు అని చెప్పడమే తప్ప వారికి ప్రభుత్వాలు చేసిందేమీ లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలకు వెళ్తే మిల్లరు నుంచి పర్మిషన్ రాలేదని, ఇంకా కొనలేమని రైతులు చెబుతున్నారు. దళారీల ద్వారా కొంటున్న రైస్ మిల్లర్లు ప్రభుత్వం ద్వారా కొనుగోలుకు ఎందుకు ముందుకు రావడం లేదో ఎవరికీ అర్థం కావడంలేదు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



దళారులు కొని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

# అంతటా సంక్రాంతి సందడి


పార్వతీపురం : పల్లెల్లో గంగిరెద్దుల సందడి

ప్రజాశక్తి - సాలూరు

వరుసగా రెండేళ్ల పాటు కరోనా వైరస్‌తో పోరాడి ఊపిరి పీల్చుకున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు సంక్రాంతి పండుగ ఆడంబరంగా నిర్వహించుకోడానికి సిద్ధమవుతున్నారు. పట్టణ, పల్లెల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, పిల్లల రాకపోకలు ఊపందుకున్నాయి. గత రెండు రోజులుగా ఆర్టీసీ బస్సులు విపరీతమైన రద్దీతో తిరుగుతున్నాయి. జాతీయ రహదారి పట్టణం నడిబొడ్డు మీదుగా వెళ్తుండడంతో వాహనాల రాకపోకలతో మెయిన్ రోడ్డు కిక్కిరిసి పోయింది. బట్టల దుకాణాలు, కిరాణా షాపుల్లో జనాల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఫలితంగా బోసు బొమ్మ జంక్షన్ నుంచి వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్ వరకు ట్రాఫిక్ అంతరాయం తరచూ ఏర్పడింది. సుదూర గ్రామాలు, పట్టణాల నుంచి కార్లలో బంధువులు వస్తుండడంతో పట్టణానికి సంక్రాంతి పండుగ శోభ సంతరించుకుంది. పెదమార్కెట్, చినబజార్‌ల్లో కిరాణా దుకాణాలు జనసమ్మర్ధంగా కనిపించాయి. గత రెండేళ్లుగా కరోనా ఆంక్షలతో సంక్రాంతి పండుగకు దూరంగా వున్న ప్రజలు ఈ ఏడాది ఆడంబరంగా నిర్వహించుకోడానికి సిద్ధమవుతున్నారు

**పాలకొండ** : సంక్రాంతి పండగ వచ్చిందంటే పల్లెల్లో హడావుడి. ఎక్కడో వలసలు ఉంటున్న వారంతా సంక్రాంతి పండగకు సొంత గ్రామాలకు చేరుకోవడంతో పండగ వాతావరణం కనిపిస్తుంది. శుక్రవారం నుంచే ఈ వాతావరణం పాలకొండలో కనిపించింది. పట్టణంలో మార్కెట్ కొనుగోలుదారులతో కళకళలాడుతూ కనిపించింది. వస్త్రదుకాణాలు, కిరాణాషాపులు జనం రద్దీతో కిటకిటలాడింది. గ్రామాల్లో కూడా పండగ వాతావరణం నెలకొంది. కొత్త అల్లుల్లు, కూతుర్లు తిరిగి గ్రామాలకు రావడం తెలుగింటి ఆచారమైన సంక్రాంతి పండగ కావడంతో ఊళ్లలో పిల్లలు, పెద్దలు కలిపిమెలసి తిరుగుతూ సందడి చేస్తున్నారు.

**పల్లెగూటికి పంగడొచ్చింది...**

**పార్వతీపురంరూరల్ :** సంక్రాంతి పండగ వేడుకలకు పల్లె జనాలు సిద్ధమౌతున్నారు. మండలంతో పాటు ఇతర గ్రామాల్లో ఏ ఇంటచూసినా పండగకు ముస్తామవుతున్నాయి. ఏ నలుగురు కలిస్తే చాలు మీవాళ్లు వచ్చేవారా, మావాళ్లు బయలుదేరుతున్నారన్న కబుర్లు వినిపిస్తున్నాయి. ఇళ్లకు రంగులు, సున్నాలు హడావిడితో పాటు, బల్లలపై ఉన్న పాత ఇత్తడిసామానులు కిందకు దించి తళతళా మెరిసేలా చేసే కార్యక్రమంలో మహిళలు నిమగ్నం కాగా, మరికొంత మంది ఇరుగుపొరుగువారితో కలసి సామూహికంగా ఒకరికొకరు సాయం చేసుకుంటూ పిండి వంటలను తయారు చేసుకొనే దృశ్యాలు స్వాగతిస్తున్నాయి. పండగకు కొన్న కొత్తచీరలు, దుస్తులు గొప్పగా ఇరుగుపొరుగులకు చూపించి, ఎంపికలో తమ పాతవాన్ని ఎదుటవారు గుర్తించి, బాగుందనే మాటకోసం అర్రులో చాస్తున్నారు. వీధుల్లో హరిదాసు కీర్తనలు, గంగిరెద్దువాళ సన్నాయి రాగాలు సరేసరి, ఏడాదంతా సేవలు అందించినందుకు కులవృత్తు చేసేవాళ్లు పండగమామూళ్ల వసూలు చేసుకుంటు ఆనందిస్తున్నారు. గత ఏడాదికన్నా ఈఏడాది ధాన్యం కొనుగోలులో కదలిక వచ్చి, కొంతమందికి డబ్బులు బ్యాంకుల్లో జమకావడంతో వాటిని తీసుకునేందుకు కొంతమంది బ్యాంకులకు పరుగులుతీస్తుంటే, తమ ఖాతాల్లో ఇంకా జమకానివారు, చేబదుళ్ల వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ పండగకు సొంతగూటికి చేరుకునే కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్ళతో ఆనందంగా గడిపి మూడురోజులు అనుభవాలు ఏడాదంతా గుర్తుండిపోయేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వంటలు వండాలని పల్లె లోగిళ్లలోని జనాలు ఆరాటం చూస్తుంటే ఆప్యాయత,అనురాగాలు ఆశ్చర్యపోతున్నాయి.

## కిటకిటలాడుతున్న దుకాణాలు
## వాహనాలతో కిక్కిరిసిన రహదారులు

**సందడిగా షాపులు**

**జియ్యమ్మవలస :** సంక్రాంతి సమీపించడంతో షాపులన్నీ కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. బట్టల వ్యాపారమే కాక, కిరాణా షాపుల్లో కూడా రద్దీ ఉంది. సంప్రదాయబద్ధంగా జరుపుకునే సంక్రాంతి కోసం కావాల్సిన సామాన్లు అన్నింటినీ కొనుక్కోవడానికి చినమేరంగికి ఆనుకొని ఉన్న పరిసర గ్రామ ప్రజానీకమంతా చినమేరంగి వచ్చి తమకు కావాల్సిన సామాగ్రిని కొనుగోలు చేయడానికి రావడంతో గ్రామంలో హడావిడి నెలకొంది.

**పండగ కోసం స్వగ్రామాలకు...**

**పార్వతీపురం టౌన్ :** ఉద్యోగ, ఉపాధి కోసం స్వగ్రామాలను విడిచి సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారంతా సంక్రాంతి పండగకు సొంతూళ్ల పెద్దఎత్తున తరలిస్తున్నారు. దీంతో స్థానిక రైల్వేస్టేషన్లు, ఆర్‌టిసి కాంప్లెక్స్ రద్దీగా కనిపిస్తున్నాయి. అలాగే పండగ నిమిత్తం బట్టలు, నిత్యవసర, కిరాణా సామాగ్రి కొనుగోలు చేసేందుకు పట్టణానికి రావడంతో స్థానిక ప్రధాని రహదారి కూడళ్ల అన్ని రద్దీగా తయారయ్యాయి.

**మక్కువ :** మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారపు సంత జన సందోహంతో కిటకిటలాడింది. పండగ ముందు రోజు సంత కావడంతో పెద్ద ఎత్తున ప్రజలు సరుకులు కొనేందుకు ఎగబడ్డారు. దీంతో మక్కువలోని అన్ని దుకాణాల వద్ద ఇదే పరిస్థితి. పెద్ద ఎత్తున జనం చేరడంతో వాహనదారులకు కొంత ఇబ్బంది ఏర్పడింది. దీంతో వంద అడుగుల రహదారి ఎప్పుడొస్తుందో అప్పుడే ట్రాఫిక్ సమస్యలు గట్టెకుతాయని ఆశగా ఎదురు చూస్తున్నామని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.


పార్వతీపురం : స్వగ్రామాలకు చేరుకుంటున్న ఉద్యోగులు, యువత


పాలకొండ : కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్


జియ్యమ్మవలస : చినమేరంగిలో కిటకిటలాడుతున్న వస్త్ర దుకాణం


మక్కువ : రద్దీగా ఉన్న సంత


గ్రామస్తులకు వైద్యతనిఖీ చేస్తున్న వైద్యాధికారి

## కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

**వీరఘట్టం :** మండలంలోని కిమ్మిలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎస్.తనుజా 40 మందికి వైద్య తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నవోనమ్మ, టెక్నీషియన్ దినేష్, సచివాలయ కార్యదర్శి తిరుపతిరావు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వీధిలైట్లను ప్రారంభిస్తున్న ఎంపిపి, సర్పంచ్

## ఎట్టకేలకు విద్యుత్తు దీపాలు ఏర్పాటు

**వీరఘట్టం :** మండలంలోని తూడి గ్రామ సిఎస్‌పి రహదారి నుంచి గ్రామం వరకూ సుమారు కిలోమీటర్ దూరంలో విద్యుత్ లైన్‌తో పాటు దీపాలను శుక్రవారం ఎంపిపి డి.వెంకటరమణనాయుడు ప్రారంభించారు. గత ఏడాది జూలై 31న ఇదే గ్రామానికి చెందిన సర్పంచ్ కె.వెంకటరమణ మండల సర్వసభ్య సమావేశంలో విద్యుత్తు లైన్‌తో పాటు దీపాలు ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిటిసిలు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.6 లక్షల పైబడి అంచనా వ్యయంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలోక పెట్టుకొని ఎట్టకేలకు విద్యుత్తు లైనుతో పాటు దీపాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు విజయ కుమారి, పిఎసిఎస్ అధ్యక్షులు గోవిందరావు , రేగులపాడు సర్పంచ్ ఎం.ఉషారాణి, సచివాలయ కార్యదర్శి ఎ.చిన్నారావు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

## ప్రజారోగ్యంలో పరిసరాల పరిశుభ్రత కీలకం

**పార్వతీపురంరూరల్,గరుగుబిల్లి :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల చాలా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలో ఉల్లిభద్ర, ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేనిచో అవి దోమలకు ఆవాసాలుగా మారి వివిధ రకాల జ్వరాలకు కారణమవుతాయని తెలిపారు. ప్రతి షాపు వద్ద విధిగా చెత్త బుట్టలు ఉంచాలని, పరిసరాల్లో చెత్త వేయకుండా చూసుకోవాలని షాపు యజమానులకు సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్రై డే - డ్రై డే ర్యాలీలో పాల్గొన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, సంబంధిత శాఖల తో సమన్వయం చేసుకోవాలని జగన్మోహన్ వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి, కార్యదర్శి పెదకోటేశ్వరరావు, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా కళాకారుల సంఘం నాయకులు

## ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం కేలండర్ ఆవిష్కరణ

**జియ్యమ్మవలస :** ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ మండలంలోని పెదమేరంగి జంక్షన్లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాకళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రౌతు వాసుదేవరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాలన్నారు. టెక్నాలజీ పెరగడంతో విష సంస్కృతి ఏరులై పారుతుందన్నారు. ఆచార, సాంప్రదాయాలను కాపాడేలా కళాకారులు తమ వంతు కృషి చేస్తున్నారని, ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం కూడా అందుకు అనుకూలంగా పనిచేస్తుందని అన్నారు. సామాజిక దృక్పథం ప్రజా సమస్యలపై నిరంతరము సంఘం పనిచేస్తుంటుందని భవిష్యత్ తరాల వారికి సంస్కృతి సాంప్రదాయాలను అందించడమే ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన ధ్యేయమనీ అన్నారు. కార్యక్రమంలో ఎపికెకెఎస్ సంఘం సభ్యులు రౌతు అజయ్ కుమార్, ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బలగ వెంకటరమణ, దాసరి శేషగిరిరావు, గొట్టిపల్లి రామచంద్రరావు, సతీష్, డి.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

# సొంతింటి కలను సాకారం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్రంలో ఇళ్ల లేని పేదలెవరూ ఉండరాదనే సంకల్పంతో ప్రభుత్వం అందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల మంజూరు చేసి వారి సొంత ఇంటి కలను సహకారం చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక మున్సిపాల్టీలో ఇప్పటికే సుమారు 3,100 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు గతంలో మంజూరు చేయగా అందులో కొంత మందికి ప్లాట్ల రీసైజింగ్లో స్థలాలు కోల్పోయిన వారికి లాటరీ పద్ధతిలో ఇండ్ల స్థలాలు పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇటీవల 14 సచివాలయాల పరిధిలో గల 28 వార్డుల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్ల కోసం అర్జీ పెట్టుకున్న వారికి వీటిని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అందరి జీవిత కాలం ఆశయాన్ని నెరవేర్చిన ప్రభుత్వమని ఇళ్ల స్థలాలు వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పక ఇళ్ల నిర్మాణం సకాలంలో మొదలు పెట్టి పూర్తి చేసుకోవాలన్న ప్రభుత్వ ఆశయాన్ని పూర్తి స్థాయిలో అయ్యేలా మీరంతా మీకు వచ్చిన ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేశ్వరరావు, మున్సిపల్ కమిషర్ రామప్పల నాయుడు, తహశీల్దార్ శివన్నారాయణ, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, వైసిపి నాయకులు, లబ్ధిదారులు, మున్సిపల్, సచివాలయంల అధికారులు తదితరులు పాల్గొన్నారు..


లాటరీ ద్వారా లబ్దిదారులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సరస్వతి విద్యానికేతన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతులకు ఎల్విన్‌పే సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఆయన భార్య పావని బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు, ఇతర కళల్లో ప్రావీణ్యత సంపాదించడం మంచిదే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యా నికేత నిర్వాహకులు బుడంకాయలు విమల పాల్గొన్నారు.

**సంక్రాంతి ఆటల పోటీలు**

**సీతానగరం :** మండలంలోని చిన్న భోగిలిలో సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు డ్రిల్ మాస్టర్ మురళి తెలిపారు. వాలీబాల్ క్రికెట్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి సంబరాలను ఆయా గ్రామ పాత విద్యార్థుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు రేపు, ఎల్లుండి జరుగుతున్నట్లు తెలిపారు.


విజేతకు బహుమతి అందజేస్తున్న సిఐ దంపతులు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ పి.సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా ఆయన ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో ఉన్న ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు సంక్రాంతి పండుగకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో జరుపుకుకోవాలన్నారు. అలాగే ప్రజలెవరూ కోడిపందాలు, పేకాట ఆడడం వంటివి ఆడరాదని, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పండగ సమయంలో పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని ప్రజలకు తెలిపారు. ఈ మేరకు ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో గల ఎస్ఐలు, సిబ్బంది ఎప్పటికప్పుడు వాహనాలు తనిఖీ చేస్తుంటారని, ప్రజలకు ఇబ్బంది కలిగించిన వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**సీతంపేట :** సంక్రాంతి పండుగ సీజన్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీతంపేట, దోనుబాయి ఎస్ఐలు నీలకంఠం, పి.కిశోర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సెలవులు కావడంతో ప్రజలంతా తమ సొంత గ్రామాలకు బయలుదేరి వెళ్తున్నారుని, ఇటువంటి సమయంలో ఎవరి ఇంట్లో విలువైన ఆభరణాలు విడిచి వెళ్లారాదన్నారు. సొంత గ్రామాలకు వెళ్లే వారు ఎక్కువ గా ఉండడంతో రోడ్లు ఎక్కువ రద్దీగా ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. గ్రామాల్లో కోడి పందేలు గానీ, పేకాట గాని, గుళ్లట గాని ఆడరాదు.. ఆడినట్లైతే చట్టరీత్య నేరమని హెచ్చరించారు. అలాగే నాటు సారా తయారు చేయడం, రవాణా, అమ్మడం వంటివి చేసినట్లయితే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అధిక ఛార్జీలు వసూలు చేయొద్దు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పండగ రోజుల్లో కాంట్రాక్టు క్యారేజ్ బస్సు సర్వీసులు, ప్రైవేటు వోల్వో బస్సులు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి ఎం.శశి కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పండుగ రోజుల్లో రద్దీని చూసి ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తాము కూడా ప్రతి జిల్లాలోనూ కాపలా కాచి ప్రజాణికుల నుంచి సమాచారం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులు దూర ప్రాంతాల నుంచి తమ స్వగ్రామాలకు చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఈ మేరకు అటువంటి ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయడం నేరమని అన్నారు. ఎక్కడైనా ఏ బస్సు నుంచైనా అధిక ఛార్జీలు వసూలు చేసినట్లయితే ప్రయాణికులు తమకు తక్షణమే సమాచారం అందించాలని తెలిపారు. ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే 9154294416 సెల్‌కు ఫిర్యాదు చేస్తే అటువంటి బస్సులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి -సీతానగరం

మండల కేంద్రమైన గూడెం వీధిలో పూరింట్లో నివాసముంటున్న 7 కుటుంబాలకు చెందిన నివాసాలు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండల అధికారులను, ప్రజా ప్రతినిధులను అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి పంపించి బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు. ఘటనలో సర్వస్వం కోల్పోయిన బాధితులను అత్యవసరంగా ఆదుకునే క్రమంలో ఎమ్మెల్యే తన సొంత నిధులను సమకూర్చి ఒక్కో కుటుంబానికి రూ.5వేలు, బట్టలు, 50 కేజీల బియ్యం బస్తాలు అందజేశారు. ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే కొత్త ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు ప్రభుత్వం తరపున అందజేస్తుందన్నారు. అంతేకాక బాధితులకు అత్యవసరమైన వంట పాత్రలు, ఇతర సామాన్లను సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, మండల బూత్ కన్వీనర్ బలగ శ్రీరాములునాయుడు, ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పోల ఈశ్వర నారాయణ, స్థానిక ఎంపిటిసిసభ్యులు బురిడి సూర్యనారాయణ, సురగాల కిరణ్ కుమార్, ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**బాధితులకు మున్నా రూ.35వేలు ఆర్థికసాయం**

సీతానగరంలోని అగ్ని బాధిత కుటుంబాలకు అత్యవసర సహాయంగా రూ.35 వేల ఆర్థిక సహాయాన్ని వైసిపి నాయకులు బొత్స లక్ష్మణరావు మేనల్లుడు మున్నా అందజేశారు. బాధితులను పరామర్శించి వారికి ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు బట్టలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

## కోనేరులో పడి మూడేళ్ల బాలుడు మృతి

ప్రజాశక్తి - డెంకాడ

భోగాపురం మండలం పోలిపల్లిగ్రామంలో కోనేరులో జారిపడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముడసల గురువులు, లక్ష్మీ దంపతులు పోలిపల్లికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వారు కుమారులిద్దరూ కోనేరు వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ జారిపడి ఇద్దరూ కోనేరులో పడిపోయారు. పెద్ద కుమారుడు ప్రాణాలతో బయటపడగా, చిన్న కుమారుడు గౌతమ్ మృతి చెందాడు.

## కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని మరుగువాడకు చెందిన ఆరిక రాజశేఖర్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన అతని మేనమామ రాజశేఖర్‌ను పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాజశేఖర్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ వద్ద ఉంటూ జియ్యమ్మవలసలోని ఉపాధిహామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆత్మహత్యాత్నానికి గల కారణాల తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్ పోసు పోలీసులు కేసు నమోదు చేశారు.

# పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఉపాధిహామీ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రతి వేతన దారుడు గరిష్ఠంగా రోజుకు రూ.250 వచ్చేలా పనిచేయాలన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాల కోసం అడిగి తెలుసుకున్నారు. పనిచేసిన చోటే అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేతనదారుడు మస్తర్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.నాగలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

## పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని పారిశుధ్య కార్మికులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి కొత్త బట్టలు పంపిణీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు బట్టలు పంపిణీ చేశారు. మహిళా కార్మికులకు చీరలు, జాకెట్లు, పురుషులకు తువ్వాళ్లు, లుంగీలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు, కౌన్సిలర్ లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

## ఉద్యానవన నీటి కుంటలు పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నీటి కుంటలను ఆ శాఖ డిహెచ్ఒసత్యనారాయణ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీ పరిధిలోని పెదగైశీల, మూకవలస, మార్కొండపుట్టిలో నిర్మించిన నీటి కుంటలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఒ పుష్ప, భాను, క్రాంతి కుమార్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు .